సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

పార్కా.. ధోబీఖానా..?



పార్కులో పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రజలకు ఆహ్లాదం పంచేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.16 లక్షలతో నిర్మించిన పార్కు అది. కానీ, పార్కు లోపలికి వెళితే ఇది పార్కా, ధోబీఖానా అనే సందేహం వచ్చేలా ఉంది పరిస్థితి. పార్కులో తాళ్లు కట్టి ఆరబెట్టడంతో అన్ని వైపులా బట్టలు తోరణాల్లా కనిపిస్తున్నాయి. గతేడాది అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ స్థితికి వచ్చింది. లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతోంది.

- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.16.30 లక్షలతో పార్కు అభివృద్ధి
- ఎన్నికల కోడ్ కారణంగా మధ్యలో నిలిచిన పనులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక దృష్టి సారించని వైనం
- శంకువానిపాలెంలో ధోబీఖానాను తలపిస్తున్న పార్కు



పార్కులో ఏర్పాటు చేసిన వినాయక మండపం (ఫైల్)



అక్కయ్యపాలెం శంకువానిపాలెంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన పార్కు



శంకువానిపాలెం పార్కులో తాళ్లు కట్టి రజకులు ఆరబెట్టిన బట్టలు

సీతంపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉత్తర నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి విలువైన రహదారులు, పార్కులు, ఓపెన్ జిమ్స్, బ్యూటిఫికేషన్, బస్ షెల్టర్లు, జంక్షన్ల బ్యూటిఫికేషన్, ఫుట్‌పాత్‌లు, ఆస్పత్రులు, స్కూల్స్ వంటి ఎన్నో అభివృద్ధి పనులను అన్ని వార్డుల్లో చేపట్టింది. చాలావరకు పూర్తయినా, మరికొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతుండగా ఎన్నికల కోడ్ రావడంతో సగంలోనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ అభివృద్ధి పనులను పూర్తి చేయాల్సి ఉండగా.. కనీసం వాటి వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం నిరుపయోగంగా మారింది.

పార్కు నిర్మాణం జరిగిందిలా..

జీవీఎంసీ 26వ పరిధి శంకువానిపాలెంలో ధోబీఖానా పక్కన ఉన్న స్థలాన్ని ఒక వ్యక్తి కబ్జా చేసి మూడంతస్తుల భవంతి నిర్మించాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో స్పందించిన అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్రమ భవనాన్ని కూల్చివేసింది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కె.కె.రాజు చొరవతో ప్రజలకు ఉపయోగపడేలా ఆ స్థలంలో రూ.16.30లక్షల వ్యయంతో పార్కును అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్ నిర్మించి, కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసి, 2024 మార్చిలో పార్కును ప్రారంభించారు. ఇంకా పార్కులో మొక్కలు నాటడం, గ్రీనరీ అభివృద్ధి, విద్యుత్ దీపాలు అమర్చడం వంటి పనులు చేయాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోలేదు. కనీసం పార్కు నిర్వహణ కూడా చేపట్టలేకపోయింది. ఫలితంగా పార్కు ఆకతాయిలకు, మందుబాబులకు అడ్డాగా మారింది. సిమెంట్ బెంచీలు విరిగిపోయాయి. పార్కు చెత్త చెదారంతో నిండి కళను కోల్పోయింది. మరోవైపు పక్కనే ధోబీఖానాలో ఉన్న రజకులు దీనిలో బట్టలు ఆరవేసి, పార్కును కూడా ధోబీఖానాలా మార్చేశారు. దీంతో పార్కు పగలు ధోబీఖానాగా, సాయంత్రమైతే అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం



ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా, పిల్లలకు ఆటవిడుపుగా ఉండేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లక్షలు ఖర్చు చేసి పార్కును అభివృద్ధి చేశారు. పచ్చదనం పెంపొందించి, విద్యుత్ దీపాలు వేయాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ వచ్చింది. అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం పార్కు పనులు పూర్తి చెయ్యకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. ఫలితంగా నలుగురికి ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు కళావిహీనంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు అభివృద్ధి, నిర్వహణపై దృష్టి సారించాలి.

– పీలా వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి

పట్టించుకునే వారేరీ?



వార్డులో ప్రజలకు అందుబాటులో ఉండేలా పార్కు నిర్మించారు. వాకింగ్ ట్రాక్ సేద తీరడానికి సిమెంట్ బెంచీలతో అందంగా అభివృద్ధి చేశారు. ప్రభుత్వం మారాక పార్కు నిర్లక్ష్యానికి గురైంది. పట్టించుకునే వారు కరువయ్యారు. పార్కులో సగం బెంచీలు విరిగిపోయాయి. చెత్త చెదారంతో నిండిపోయింది.

– నక్కా శ్యామల, వైఎస్సార్‌సీపీ నాయకురాలు

క్లుప్తంగా

30 నుంచి ధ్యానమందిరం వార్షిక వేడుకలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యానమందిరం వార్షిక వేడుకలను ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు. వార్షికోత్సవాల కరపత్రికను సోమవారం ధ్యానమందిరంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు అల్లవరపు కార్తికేయ నాగేంద్ర శర్మ, అర్చకులు అల్లవరపు భాస్కర్‌శర్మ, ఐలూరి శ్రీనివాసశర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



కాలువ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సోమవారం పరిశీలించారు. కళింగనగర్, సీతన్న గార్డెన్స్‌లో సీసీ రోడ్లు, చిట్టిబాబు కాలనీలో గెడ్డ రిటైనింగ్ వాల్, వుడా కాలనీలో కల్వర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట జీవీఎంసీ అధికారులు ఉన్నారు.

జోన్‌-5 పీజీఆర్‌ఎస్‌కు రెండే వినతులు



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జీవీఎంసీ జోన్‌–5 జ్ఞానాపురం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు రెండే వినతులు వచ్చాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వినతులను స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి –1, ఇంజినీరింగ్ విభాగానికి –1 చొప్పున వినతులు రాగా, ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌వోలు బాబురావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, విద్యుత్ లైట్ల ఏఈ అర్చన, వాటర్ ఏఈ సుమన్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు, టీపీవో ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వో జనార్దనరావు, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

మద్దిలపాలెం : ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరూ కృషి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఎన్నేళ్లయినా స్థిరంగా ఉండడానికి భారతీయ ఓటర్లే కారణమన్నారు. ఏయూ పొలిటికల్ సైన్స్ – పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ అకౌంటబిలిటీ ఫౌండేషన్ (ఐడియా) సంయుక్తంగా అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఎన్ని కుల సమీకరణలు జరిగినా, ఎన్ని ప్రజాస్వామిక దుర్ఘటనలు ఎదురైనప్పటికీ అందరూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేశారని కొనియాడారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువల వల్లే ప్రపంచంలో భారత్ మహోన్నత దేశంగా నిలుస్తోందన్నారు. ఆచార్య ఈఏ నారాయణ, పాలిటిక్స్ విభాగాధిపతి ఆచార్య ప్రేమానందం, ఐడియా చైర్మన్ డాక్టర్ తాడి నాగరాజు, పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు మన మోక్షగుండం



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్



ఐఈఐ సమావేశంలో పాల్గొన్న అతిథులు



ఈపీడీసీఎల్ కార్యాలయంలో మోక్షగుండం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

మురళీనగర్: ఇంజినీరింగ్ రంగానికి వన్నె తెచ్చిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్లందరికీ ఆదర్శనీయుడని హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఇంజినీరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాలలోని మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య భారతదేశపు అత్యుత్తమ ఇంజినీరుగానే కాకుండా రాజనీతిజ్ఞుడిగా పేరు గడించారని వివరించారు. మైసూరులోని కృష్ణరాజ సాగర్‌కు చీఫ్ ఇంజినీర్‌గా పనిచేశారన్నారు. హైదరాబాదు మూసీ నదిని వరదల నుంచి రక్షించడానికి ఆయన పథకాలను రూపొందించారన్నారు. ఆయన సేవలకు గాను భారత ప్రభుత్వం భారతరత్న అవార్డును, బ్రిటిష్ ప్రభుత్వం తరపున ఐదో కింగ్ జార్జ్ బ్రిటిష్ నైట్ హుడ్‌ను అందించి గౌరవించారన్నారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని ఇంజినీరింగ్ విభాగంలో నూతన ఆవిష్కరణలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, కాలేజీ ఇతర విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో..

తాటిచెట్లపాలెం: ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీజీఎంలు మాట్లాడుతూ మోక్షగుండం జీవితం ప్రతి ఇంజినీర్‌కు ఆదర్శమన్నారు. ఆదునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి, వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు ఇంజినీర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, బి.అశోక్‌కుమార్, ఎస్.రాజాబాబు, బి.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఈఐ లోకల్ సెంటర్‌లో..

ఇంజినీర్స్ డే ను దొండపర్తిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) లోకల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ మెడ్‌టెక్ జోన్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్ర శర్మ మాట్లాడుతూ ఇంజినీర్స్ డే విశిష్టతను తెలియజేశారు. విశిష్ట అతిథి ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు రూపకల్పనలో ఇంజినీర్ల పాత్రను, ముఖ్యంగా డీప్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాలలో ఇంజినీర్ల కృషిని తెలియజేశారు.

ఎమినెంట్ ఇంజినీర్ అవార్డుల ప్రదానం

ఇంజినీరింగ్ రంగంలో చేసిన విశేష సేవలకు ప్రతిష్టాత్మకమైన ఎమినెంట్ ఇంజినీర్ అవార్డులను ప్రొఫెసర్, డాక్టర్ కె. వెంకటసుబ్బయ్య, డాక్టర్ ఆర్‌వీఎస్ సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ డాక్టర్ బి.శరత్‌కుమార్ అందుకున్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ఇంజినీరింగ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సియోనిక్ ఫార్మాస్యూటికల్స్ డైరెక్టర్ (ఆపరేషన్స్) జె.సుబ్బారావు, ఐఈఐ లోకల్ సెంటర్ గౌరవ సెక్రటరీ డాక్టర్ చల్లా సురేష్, ఎఫ్ఐఈ చైర్మన్ డాక్టర్ కేవీ రామమోహనరావు, ఐఈఐ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ జి.పద్మావతి, ఐఈఐ సభ్యులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో జెడ్సీ పర్యటన



కొండచరియ విరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ రాము

మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని సాయిరామ్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సోమవారం పర్యటించారు. ఇటీవల వర్షాలకు ఓ ఇంటి పునాది దిగువ భాగం జారిపోయిన ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, అక్కడి వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక బస్తాలతో ఏర్పాటు చేసిన రక్షణ చర్యలను పరిశీలించారు. ప్రమాదకరంగా మారిన ప్రాంతంలోని నివాసితులను ఖాళీ చేయించాలని అధికారులకు సూచించారు. రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. తెన్నేటినగర్‌ను సందర్శించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. కార్యక్రమంలో 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, బీజేపీ అధ్యక్షుడు కూన వెంకటరావు, జనసేన అధ్యక్షుడు ఎస్.శివ సాగర్ పాల్గొన్నారు.

మట్టిలో కూరుకుపోయిన వ్యాన్



మహారాణి పార్లర్ కూడలి వద్ద మట్టిలో కూరుకుపోయిన చక్రాలు

సీతంపేట: స్థానిక అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో మహారాణి పార్లర్ కూడలి వద్ద రోడ్డు మధ్యలో వ్యాన్ వెనుక టైర్లు దిగబడిపోయాయి. అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో 24/7 తాగునీటి సరఫరా కోసం అమృత్ 2.0 పనుల్లో భాగంగా రహదారులను తవ్వారు. పనుల అనంతరం గోతులను మట్టితో కప్పి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కోతకు గురైంది. లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ గోతిలో దిగబడి కూరుకుపోయింది. చక్రాలు ముందుకు, వెనక్కు కదిలే పరిస్థితి లేక ట్రాఫిక్ జామ్ అయింది. స్థానికులు, ఆటో డ్రైవర్ల సాయంతో అతి కష్టంపై వ్యాన్‌ను బయటకు తీశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తవ్విన గోతులను కాంక్రీట్‌తో పూడ్చాలని స్థానికులు కోరారు.

28న రోటరీ క్లబ్ బ్యాడ్మింటన్ టోర్నీ



డీఆర్‌ఎం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: పోలియో నివారణ నిధి సేకరణ లక్ష్యంగా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన రోటరీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ చింత నేతాజీ తెలిపారు. టోర్నీ పోస్టర్‌ను డీఆర్‌ఎం కార్యాలయ ఆవరణలో రోటరీ క్లబ్ ప్రతినిధులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ రోటరీ క్లబ్ 3020 డిస్ట్రిక్ట్ పరిధిలో ఉన్న 80క్లబ్బుల నుంచి క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. సెప్టెంబరు 28న రైల్వే ఇండోర్ స్టేడియంలో ఈ టోర్నమెంట్‌ను పురుషులు డబుల్స్, మహిళల డబుల్స్ విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ వివరాల కోసం క్లబ్ సెక్రటరీ పి.భాస్కర్ (90521 30686), ఎస్.సునీల్‌కుమార్ (62812 51231), కల్యాణ్ చక్రవర్తిలను సంప్రదించవచ్చని సూచించారు. పోస్టర్ ఆవిష్కరణలో క్లబ్ సెక్రటరీ పి.భాస్కర్, నరేంద్ర జగన్, డాక్టర్ ఎస్.నరేష్, డాక్టర్ అశోక్ దేవరకొండ, కేఎంకే రమేష్, ఎస్.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ సోమవారం తెలిపారు. బ్రాడ్ బాండ్ టెక్నీషియన్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 18 ఏళ్ల నిండి 40 ఏళ్ల లోపు, పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 7981022453, 9063269849లలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మెమోరాండం సమర్పించేందుకు వచ్చిన ఏపీటీఎఫ్ నాయకులు

తాటిచెట్లపాలెం: ఉద్యోగుల, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్–257 నాయకులు అర్బన్ తహసీల్దార్‌కు సోమవారం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహిస్తోందన్నారు. బకాయిలు విడుదల చేయడంతో పాటు ఉద్యోగులకు సమయానుకులంగా రావలసిన ఆర్థిక ప్రయోజనాలు కల్పించడంలో ఏ మాత్రం ఉద్యోగుల పక్షం వహించడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు గానీ, వేతన సవరణ గానీ, కరువు భత్యం కానీ మంజూరు చేయడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడిచాయి, కానీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అసంతృప్తిగా ఉన్నారని, ఈ అంశాలపై మెమోరాండం సమర్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ 257 ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, సీతమ్మధార మండల అధ్యక్ష కార్యదర్శులు బలిరెడ్డి శ్రీనివాసరావు, బి.కె.దుర్గా కుమారి, మహారాణిపేట మండల అధ్యక్షుడు బండారు దేముడుబాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్వీయ ఆవిష్కరణలతో అభివృద్ధి సాధ్యం

విశాఖ నావికాదళం చీఫ్ ఇంజినీర్ పంకజ్ త్యాగి



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పంకజ్ త్యాగి, తదితరులు

మద్దిలపాలెం : స్వీయ ఆవిష్కరణతో దేశం అభివృద్ధి సాధిస్తుందని విశాఖ నావికాదళం చీఫ్ ఇంజినీర్ పంకజ్ త్యాగి అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల వార్షిక సమ్మేళనం యాక్సెస్ 2కె 25ను ఆయన ప్రారంభించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పంకజ్ త్యాగి మాట్లాడుతూ పర్యావరణహితంగా నిలిచే నిర్మాణాలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భవిష్యత్ భారతావనిని నిర్మించే బాధ్యతను యువతరం తీసుకోవాలన్నారు. రైల్వే నిర్మిస్తున్న అత్యంత ఎత్తైన ప్రాజెక్టులు భారత దేశ సాంకేతిక అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఐఐటీ కాన్పూర్ ఆచార్యులు ఎం.ఆర్.మాధవ్ మాట్లాడుతూ సమాజాన్ని అభివృద్ధి చేయగలిగే శక్తి ఇంజినీర్లకు ఉందన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు, సమన్వయకర్త ఆచార్య ఎస్.యజ్ఞని, విభాగ ఆచార్యులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ మానవాళి బాధ్యత

ఎంవీపీ కాలనీ : ఓజోన్ పొరను పరిరక్షించుకోవడం మానవాళి బాధ్యత అని ఏయూ విశ్రాంత ఆచార్యుడు ఇ.ఉదయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ డేను పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ ఎన్జీవో సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో అత్యంత పలుచగా ఉండే ఓజోన్ పొరను కాపాడుకోకపోవడం వల్ల జరిగే నష్టం వర్ణనాతీతం అన్నారు. విద్యార్థులు పర్యావరణహితంగా జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీ రత్నం, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగికి జాతీయ స్థాయి పురస్కారం



కేవై రెడ్డిని అభినందిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బొహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్‌కు చెందిన ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ విభాగంలో సీనియర్ టెక్నీషియన్, సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కేవై రెడ్డికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2024లో సివిల్ డిఫెన్స్ విభాగంలో ఆయన చేసిన విశేష సేవలకు గాను, న్యూఢిల్లీలో రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సివిల్ ఇంజినీరింగ్–జి) అజిత్ కుమార్ ఝా చేతుల మీదుగా బ్రాంజ్ డిస్క్ , ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం కేవై రెడ్డిని వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా అభినందించారు.

ఫార్మా రంగానికి కేంద్రం సహకరించాలి

ఏయూ క్యాంపస్ : ఫార్మా రంగంలో జాతీయ హబ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని ఎస్ఆర్‌సీ లేబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి కోరారు. విశాఖ నగర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి జె.పి.నడ్డాతో ఫార్మా రంగ పరిశ్రమలపై సోమవారం చర్చించారు. పరిశ్రమల విస్తరణతోపాటు వైద్య పరికరాల తయారీని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో 12 బిలియన్ డాలర్ల విలువ కలిగిన వైద్య పరికరాల రంగం 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పైగా పెరుగుతుందన్నారు. విశాఖ, అనకాపల్లి, కాకినాడ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన క్లస్టర్లుగా అభివృద్ధి చేయాలని కోరారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు దేశీయ ఉత్పత్తి పెరుగుదల, ఎగుమతుల వృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి టి.జి.భరత్, ఎంపీ సీఎం రమేష్, పరిశ్రమల కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు.



